
పోల్కంపల్లి వద్ద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


అలుగు పారుతున్న మహమ్మదాబాద్ మల్కచెరువు


జడ్చర్ల మండలం మీనాంబరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీవాగు

జోరువాన

- పారిన వాగులు, పొంగిన వంకలు
- నిండిన చెరువులు, నీటి మునిగిన పంటలు
- రహదారుల ధ్వంసం, రాకపోకలకు అంతరాయం
- అధికారులు, రెస్క్యూ బృందం సహాయక చర్యలు

సాక్షి, నెట్‌వర్క్: బుధవారం అర్ధరాత్రి 11:30గంటల నుంచి గురువారం తెల్లవారుజాము వరకు మొత్తం 5గంటలపాటు కురిసిన భారీవర్షానికి జడ్చర్ల జలమయమైంది. కొన్ని కాలనీలు, తండాల్లో ప్రజలు జాగరణ చేయాల్సి వచ్చింది. ఈ మధ్యకాలంలో ఎన్నడూ లేనంతగా 12.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. మున్సిపాలిటీ, గ్రామాలు అతలాకుతలమయ్యాయి. నల్లకుంటనుంచి వచ్చిన నీటితో ప్రధాన రోడ్డు చెరువులను తలపించింది. ఊరచెరువు నిండి పోచమ్మ ఆలయం వరకు నీరుచేరడంతో గ్యాస్‌గోడౌన్ వద్ద అలుగు తెంపారు. ఒక్కసారిగా చెరువునీరు పద్మావతికాలనీలోకి వెళ్లి ఇళ్లల్లోంచి ప్రజలు బయటకు రాలేకుండా ప్రవాహం సాగింది. బాదేపల్లి ఉర్దూమీడియం హైస్కూల్‌లోకి వరదనీరు చేరడంతో విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు.

- దేవరకద్ర మండలంలోని గ్రామాల్లో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. కుంటలు, వాగులు అలుగు పారుతున్నాయి. జీన్గురాల-దేవరకద్ర మీదుగా వచ్చే లింకు రోడ్డు నీటి ఉధృతికి తెగిపోయింది. గుడిబండ, గోపన్‌పల్లి శివారులో పంట పొలాల మీదుగా వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలవడంతో అధికారులు పరిశీలించారు. డోకూర్, కొకుంట్లలోని రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు నిలిచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్దరాజమూర్‌లో చెక్‌డ్యాం అలుగు పారింది.
- భూత్పూర్ ఇటీవల కురుస్తున్న వర్షాలకు మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని దివిటిపల్లి నుంచి భారీగా కురిసిన వర్షానికి గురువారం శేరిపల్లి(బి) వద్ద జాతీయ రహదారిపైకి నీరు పారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి పరిస్థితిని పరిశీలించారు.
- చిన్నచింతకుంట మండలంలోఊకచెట్టువాగుపై నిర్మించిన 11 చెక్‌డ్యాంలు అలుగులు పారి కృష్ణానదిని తలపిస్తుంది. సీతరాంపేట, నెల్లికొండి, దమగ్నాపురం, పర్కపురం, పెద్దవడ్డేమాన్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. కొకుంట్ల మండలం ముచ్చింతలలోని రెండు చెరువులు అప్పంపల్లి చెరువు నిండి అలుగులు పారుతున్నాయి. గొలుసుకట్టు కాల్వకు ముచ్చింతల సమీపంలో గండీ ఏర్పడింది. దీంతో కాల్వ కింద 50ఎకరాల వరిపంట నీటమునిగింది.
- మిడ్జిల్ మండలం వెలుగొమ్ములలో గురువారం తెల్లవారుజామున కావలి చెన్నయ్య ఇల్లు కూలిపోయింది.

కూలిన అండర్‌పాస్ ప్రహరీ

జిల్లాకేంద్రం సమీపంలోని అప్పన్నపల్లి దగ్గర ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రహరీ గోడ బుధవారం అర్ధరాత్రి కూలిపోయింది. దీంతో జిల్లాకేంద్రం నుంచి ఎదిర గ్రామానికి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు హౌసింగ్ బోర్డు వైపు నుంచి వెళ్లాల్సి వచ్చింది. కార్పొరేషన్ అధికారులు గురువారం ఉదయం నుంచి మట్టి, సిమెంట్ దిమ్మెలు తొలగింపు పనులు చేపట్టారు.

- మూసాపేట మండలం వేముల స్టేజీ అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్న క్రమంలో ప్రధాన రోడ్డుపై కర్నూల్ వైపు వెళ్తున్న ట్రాఫిక్‌ను సర్వీస్ రోడ్డుపైకి మళ్లించారు.
- భూత్పూర్ మండలంలోని శేరిపల్లి (బి) వద్ద జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు అరగంటపాటు అంతరాయం ఏర్పడింది. మహబూబ్‌నగర రూరల్ మండలం దివిటిపల్లి వద్ద చెంచల చెరువు, లింగకుంట నిండి అంబటిపల్లి నుంచి శేరిపల్లి(బి) వద్ద తుర్కకుంటలోకి భారీగా వరద చేరింది. భూత్పూర్‌లో ఊరచెరువు, కతాల్‌ఖాన్ చెరువు, మొగుళ్ల చెరువులు అలుగులు పారుతున్నాయి. శేరిపల్లి(బి) వద్ద రాముకు చెందిన 10ఎకరాల్లో వరి పంటకు నీరు, మట్టి చేరింది. పోతులమడుగు-గోపన్నపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి.
- మహమ్మదాబాద్ మండలంలోని అతిపెద్ద చెరువైన మల్కచెరువు గురువారం తెల్లవారుజామున అలుగుపారగా బ్రాహ్మణ్‌చెరువు, మొకర్లాబాద్ లింగమయ్య చెరువు, మంగంపేట్ చెరువు, వెంకట్‌రెడ్డిపల్లి పెద్దచెరువు, గాధిర్యాల్ ఊరచెరువు, ఏటిచెరువు, నంచర్ల నాయకమ్మ చెరువు, సర్వరాజ్‌చెరువు, జూలపల్లి ఊరచెరువు నిండి అలుగు పారుతున్నాయి. కంది, పత్తి, జొన్న, మొక్కజొన్న, వరి పంటలు కొంతవరకు నీటమునిగాయి.

ఉధృతంగా దుందుబీ పరవళ్లు

- రాజాపూర్ మండల శివారులోని దుందుబీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని వాగులు వంకలు ఏరులై పారుతున్నాయి. ఈద్గాన్‌పల్లికి చెందిన దారమోని మల్లేశ్ ఆవులు నది అవతల చిక్కుకోవడంతో ఎస్‌ఐ శివానందంగౌడ్ రెస్క్యూ బృందాన్ని రప్పించి బోట్‌ద్వారా ఒడ్డుకు చేర్చారు. ముదిరెడ్డిపల్లి నుంచి నందిగామ వైపు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచి రాకపోకలు సాగించేందుకు ఎస్‌ఐ శివానందంగౌడ్ జేసీబీ సహాయంతో నీటిని తొలగించి సమస్యను పరిష్కరించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రత్నం అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాయపల్లి శివారులో చిన్నకుంట, పెద్దకుంట అలుగులు పారుతుండడంతో యువకులు చేపలు పట్టుకున్నారు.
- గండేడ్ మండలంలోని చెరువులన్నీ నిండి అలుగుపారుతున్నాయి. వెన్నాచేడ్ పెద్దచెరువు, పగిడ్యాల్ మల్లమ్మ చెరువులోకి నీరు భారీగా వచ్చి చేరింది. పలుచోట్ల వరిపైర్లు నీటమునిగాయి. దీంతో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఇరిగేషన్ వర్క్‌ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య గురువారం చెరువులను పరిశీలించారు. ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి పీర్లబండతండా వాగును పరిశీలించారు. సాలార్‌నగర్‌లో భూభారతి రీసర్వేకు 242మంది రైతులకుగానూ 137మందికి నోటీసులు జారీ చేశారు.
- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ సమీపంలో దివిటిపల్లి నుంచి అమర్‌రాజా బ్యాటరీ కంపెనీకి వెళ్లే రోడ్డు వర్షం ధాటికి పూర్తిగా ధ్వంసమైంది. గురువారం తెల్లవారుజామున డ్యూటీ చేసుకుని సిబ్బందిని తీసుకువెళ్తున్న బస్సు వర్షంలో తెగిపోయిన రోడ్డును గుర్తించకపోవడంతో ముందుభాగం పూర్తిగా తెగిపోయిన దాంట్లో పడింది. దీంతో బస్సులో ఉన్న 18మందిలో 11మందికి స్వల్ప గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు.
- మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు గురువారం భారీ వరద పోటెత్తింది. పోల్కంపల్లి, నిజాలాపూర్, సంకలమద్ది, గౌరిదేవిపల్లి, కందూర్, పొన్నకల్, గుడిబండ, రాచాల, ముత్యాలంపల్లి, బలీదుపల్లి వద్ద పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుగా ప్రవహిస్తున్నాయి. మూసాపేట, అడ్డాకుల మండలాల మీదుగా వరద నీళ్లు దిగువనున్న వనపర్తి జిల్లా మదనాపురం మండలం సరళాసాగర్ ప్రాజెక్టుకు పోటెత్తాయి. ఇదిలా ఉండగా గౌరిదేవిపల్లి, కొమిరెడ్డిపల్లి మధ్యన పెద్దవాగుపై నిర్మించిన కాజ్‌వే మీదుగా వర్షం నీళ్లు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెండు మండలాల్లో చెరువు, కుంటలు అలుగులు పారుతున్నాయి.
- మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని వాగుమధ్యలో చిక్కుకుపోయిన 800 గొర్రెలు, 9మంది కాపరులను రెస్క్యూ బృందం సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. వాగు ప్రవాహంలో 30గొర్రెలు కొట్టుకుపోయినట్లు తెలిపారు. ఉదయం కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజునాయక్, ఎస్‌ఐలు వేణు, శ్రీనివాస్ వెంటనే రెస్క్యూ బృందంతో అక్కడికి చేరుకుని పడవను తెప్పించి సహాయ చర్యలను మొదలుపెట్టారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు. రెస్క్యూ బృందంతో కాపరులు, గొర్రెలను కాపాడిన అధికారులను ఎమ్మెల్యే, కలెక్టర్ అభినందించారు.


డోకూర్ అండర్‌బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీరు


పీర్లబండ తండా వద్ద వాగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి


వేముల స్టేజీ వద్ద వేగనిరోధకాలను ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ వేణు

ఆర్అండ్ఆర్ పరిహారం జమ

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల ఖాతాల్లో ఆర్అండ్ఆర్ పరిహారం గురువారం జమ అయినట్లు నిర్వాసితులు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఆర్అండ్ఆర్ పరిహారానికి సంబంధించి రూ.175 కోట్లు విడుదల చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సంబంధిత నిర్వాసితులకు రూ.16.30 లక్షల చొప్పున అధికారులు జమ చేశారు. ఆర్అండ్ఆర్ పరిహారం తమ వ్యక్తిగత ఖాతాల్లో జమకావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయంలో చోరీ

నవాబుపేట: మండలంలోని మరికల్‌లోని రామాలయంలో చోరీ జరిగింది. ఈ విషయంలో గురువారం ఆలయ పూజారి పాండురంగశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని రామాలయంలో దేవతా విగ్రహాలకు ఉన్న 6గ్రాముముల బంగారు ఆభరణాలు, కిలోకి పైగా వెండి కిరీటం తదితర ఆభరణాలు చోరీకి గురైనట్లు పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలని విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన డివిజన్ యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం యూనియన్ డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాండు నాయక్, కార్యదర్శిగా యాదయ్యగౌడ్‌తోపాటు ఇకతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మహబూబ్‌నగర్ రూరల్: పేదల సంక్షేమమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మాచన్‌పల్లిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా 445 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కరుణశ్రీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

100మందికి ఇంజినీరింగ్ ఉచిత విద్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఎమ్మెల్యే యెన్నం గురువారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్‌లో మెరిట్ వచ్చిన వారికి ఇంజినీరింగ్ చదివే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అప్లికేషన్ ఫారంను ఎమ్మెల్యే క్యాంప్, మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలతో సమీపంలోని ఊరచెరువు పొంగిపొర్లడంతో దివిటిపల్లి నుంచి ఎదిర మధ్య కుంగిపోయిన రోడు, అప్పన్నపల్లిలో ఆర్‌యూబీ రిటెయినింగ్ వాల్‌ను పరిశీలించి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని, రోడ్డు మరమ్మతుతోపాటు ఆర్‌యూబీ వద్ద పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నగరంలోని లోతట్టు ప్రాంతమైన రామయ్యబౌలిలో పర్యటించారు. ఇళ్ల మధ్య అర్ధాంతరంగా ఆగిపోయిన వరద కాల్వ (బాక్స్ కల్వర్టు)ను చూశారు. వర్షపు నీరు సాఫీగా ముందుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి సూచించారు.


మాచన్‌పల్లిలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో మెప్మా ఉద్యోగులు, సీఓలు, ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

వరదసాయం జిల్లాకు రూ.కోటి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు వరదులు వచ్చిన నేపథ్యంలో జిల్లాకు తక్షణ సాయం కింద ప్రతిజిల్లాకు రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సచివాలయం నుంచి వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన సహాయక చర్యల కోసం అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేస్తామన్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఉమ్మడి పది జిల్లాకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. సెలవులను రద్దు చేసి అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్, డీఏఓ వెంకటేశ్ పాల్గొన్నారు.

నేటినుంచి జన్మాష్టమి వేడుకలు



స్టేషన్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం సాయంత్రం 4గంటలకు ఉట్లోత్సవం నిర్వహిస్తునట్లు నిర్వాహ కులు వరదరాజుదాస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీ ఇస్కాన్ సెంటర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల పోస్టర్లను ప్రభూజీలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలు వెల్లడించారు. 15న ఇస్కాన్ సెంటర్‌లో రాత్రి 7గంటలకు ఆదివాస మహోత్సవం, 17న ఉదయం 5గంటలకు మంగళహారతి, నందనోత్సవం, ఇస్కాన్ వ్యవస్థాపకుడు కృష్ణ కృపామూర్తి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులవారి వ్యాసపూజా మహోత్సవం ఉంటుందన్నారు.

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

గండేడ్: నీటిగుంతలో పడి కొండాపూర్‌వాసి మృతిచెందిన ఘటన చోటుచేసుకున్నది. వివరాలిలా.. గండేడ్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన చెంచు అంజిలయ్య(41) భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మంగళవారం భార్యలక్ష్మి అన్నకు రాఖీ కట్టేందుకు కూతురుతో కలిసి వికారాబాద్ జిల్లాలోని చైతన్యనగర్‌కు వెళ్లారు. మంబాపూర్ వద్ద మీరు వెళ్లండి నేను వస్తానని బస్సు దిగాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతోపాటు ఫోన్ స్విచ్చాఫ్ ఉంది. దీంతో వెతకడం ప్రారంభించారు. అయితే మంబాపూర్ శివారులో మైసమ్మ ఆలయం వద్ద నీటిగుంతలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని తెలియడంతో అక్కడికెళ్లి చూసి అంజిలయ్యగా గుర్తించింది. భార్య ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు తాండూరు ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని అప్పగించారు.

చేపలవేటకు వెళ్లి యువకుడు గల్లంతు

జడ్చర్ల: చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతైన ఘటన గురువారం జడ్చర్ల వందపడకల ఆస్పత్రి ఎదుట చోటుచేసుకుంది. బోయలకుంటకు చెందిన భాను(24) అజయ్, నరేశ్‌తో కలిసి సాయంత్రం 4గంటల ప్రాంతంలో వందపడకల ఆస్పత్రి సమీపంలో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టేందుకు ప్రవాహంలో అటు ఇటుగా తిరుగుతుండగా ఆకస్మికంగా భాను ఓ నీటిగోతిలో పడిపోయి చేతులు ఊపుతు గల్లంతయ్యాడు. కళ్లముందే మిత్రుడు భాను కేకలు పెడుతూ నీటిలో గల్లంతయ్యాడని స్నేహితులు విలపించారు. తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేసురుకుని కన్నీరుమున్నీరు అయ్యారు. జడ్చర్ల అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. గల్లంతైన యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు.

వరద, బురదను తొలగించాలి: కలెక్టర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని హనుమాన్‌పురా ఆర్‌యూబీలో నిలిచిన వరద, బురదను తక్షణమే తొలగించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలతో సైడ్‌వాల్స్, ట్రిబుల్ ఐటీ కోసం నిర్మిస్తున్న షెడ్ కూలిపోయాయి. గొల్లబండతండా, పాలిటెక్నిక్ ఏరియా వాసులకు రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం నుంచి మున్సిపల్, రైల్వే శాఖల ఆధ్వర్యంలో నీటిని తొలగించే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పెద్దచెరువు పరిసరాలను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాలలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, నీటిపారుదల శాఖ డీఈఈ మనోహర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంఈ బస్వరాజ్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, ప్రాణ, పశునష్టం జరుగకుండా చర్యలు

వర్షాలకు ఎలాంటి ఆస్తి, ప్రాణ, పశునష్టం జరుగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఇరిగేషన్ శాఖ ఈఈలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీఓలు ఎంపీఓలు, ఏంఈఓతో వెబెక్స్ సమావేశం నిర్వహించి సమీక్షించేశారు.

అప్రమత్తంగా ఉండాలి

జడ్చర్ల: వరుదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పట్టణంలో రూ.14 కోట్లతో వరద కాల్వల నిర్మాణం చేపడుతామని, ఇందుకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల మధ్య వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయే పరిస్థితులు ఉన్నాయని, ఇబ్బందులను తొలగించేందుకు రూ.44 కోట్లతో వంతెనలు నిర్మిస్తామని తెలిపారు. వాగులను దాటే ప్రయత్నం చేయొద్దని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. పాత ఇండ్లలో నివాసం ఉండొద్దని కోరారు.